క్లుప్తంగా

తహసీల్దార్‌ను కలిసిన టీజీఆర్‌ఎస్‌ఏ సభ్యులు



తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సభ్యులు

మెట్‌పల్లి రూరల్: మెట్‌పల్లి తహసీల్దార్‌గా నూతనంగా నియామకమైన ఎస్.నీతను జిల్లా రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆనంద్, భూమయ్య, విష్ణు, సురేశ్, రాజేందర్‌రావు, నరేందర్, రాజేశం, రాజేంద్రప్రసాద్, లక్ష్మీప్రసన్న, ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

మల్యాల: స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు సమష్టిగా బీజేపీ గెలుపే లక్ష్యంగా పని చేసి సత్తా చాటాలని జిల్లా కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం మండలాధ్యక్షుడు గాజుల మల్లేశం ఆధ్వర్యంలో నిర్వహించిన నాయకులు, కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా ఉపాధ్యక్షుడు బింగి వేణు, కొల్లూరి గంగాధర్, సంగని రవి, బొబ్బిలి వెంకటస్వామి, రమేశ్, రాజయ్య, రాజు, ప్రసాద్, లక్ష్మారెడ్డి, లక్ష్మణ్, రాజశేఖర్, మల్లేశంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని క్యాబినెట్‌లో తీసుకున్న నిర్ణయాన్ని అభినందిస్తూ బుధవారం వేములకుర్తి గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, జువ్వాడి నర్సింగరావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. డీసీసీ మాజీ సంయుక్త కార్యదర్శి పెంట లింబాద్రి, కాంగ్రెస్ సేవాదళ్ మండల అధ్యక్షుడు నాంపెల్లి వెంకటాద్రి, యామపూర్ సింగిల్‌విండో చైర్మన్ అంకతి రాజన్న, నాయకులు తరి రామసుజం, బుర్రి ముత్తన్న, వెంకటేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వేయించిన వైస్ చైర్మన్



ఇబ్రహీంపట్నం: అమ్మక్కపేట శివారులో రైల్వే బ్రిడ్జి వద్ద మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలాల వెంకట్‌రెడ్డి బుధవారం తన సొంత ఖర్చులతో రోడ్డు వేయించారు. గంటల తరబడి రైల్వే గేటు పడడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. పక్కనే రైల్వే బ్రిడ్జి కింద ఉన్న రోడ్డు గుంతలు, బురదమయంగా ఉండడంతో.. ఆయన మొరం పోయించి గుంతలను పూడ్చివేయించారు.

జూనియర్ కళాశాల తనిఖీ

కథలాపూర్: కథలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను రాష్ట్ర ఇంటర్ బోర్డు పరిశీలకుడు రమణారావు బుధవారం తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి నారాయణ, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అచ్యుత్‌రాజు, లెక్చరర్లున్నారు.

కలెక్టర్ ఆదేశాలతో గోడ పనులు

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు గోడ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. గత సంవత్సరం డిసెంబర్ 3న కలెక్టర్ సత్యప్రసాద్ మోడల్ స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించగా.. పాఠశాల వెనకవైపు బాలికల హాస్టల్ ఉండడంతోపాటు ఒకవైపు గోడ లేకపోవడంతో వెంటనే గోడ నిర్మించాలని మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్‌ను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మోడల్ స్కూల్‌కు ప్రీకాస్ట్ వాల్ గోడ నిర్మాణ పనులు చేపడుతున్నారు.

మమ్మల్ని ఆదుకోవాలి

జగిత్యాల: మమ్మల్ని పట్టించుకోవడం లేదని, కొడుకు, కోడలు సక్రమంగా చూసుకోవడం లేదని మల్యాల మండల కేంద్రానికి చెందిన సాయిలు–బుచ్చమ్మ దంపతులు సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్‌ను ఆశ్రయించారు. ఆర్డీవో మధుసూదన్‌కు ఫిర్యాదు చేశారు.

పడిపోయిన డ్రాగన్ ఫ్రూట్ ధర

- కిలో రూ.100
- అమ్మకానికి మార్కెట్ లేక రైతులకు ఇబ్బందులు



ఇబ్రహీంపట్నంలో అమ్మకానికి సిద్ధం



ఇబ్రహీంపట్నంలో సాగు చేస్తున్న డ్రాగన్ పంట

ఇబ్రహీంపట్నం: వివిధ పంటలు పండిస్తూ గిట్టుబాటు ధర, లాభాల్లేక నష్టపోతున్నామని భావించిన రైతులు.. డ్రాగన్ ఫ్రూట్స్ పంటలు పండిస్తే మంచి లాభాలుంటాయని ఆశించి ముందుకొచ్చారు. ఇబ్రహీంపట్నంలో పలువురు రైతులు ఆ పంటలను పండించేందుకు ఒక్కో మొక్కకు రూ.70 వెచ్చించి సంగారెడ్డి జిల్లా ఆలియాబాద్ నుంచి తీసుకొచ్చి సుమారు 5 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. హార్టికల్చర్ అధికారులు రైతులు వివిధ రకాల పండ్ల మొక్కలను పెట్టాలని అవగాహన కల్పిస్తున్నారు. రైతులు దీనికి మొగ్గు చూపి ముందుకొచ్చి సాగు చేస్తున్నా.. తీరా చేతికొచ్చిన పండ్లను అమ్ముకునేందుకు మార్కెట్ లేక చిల్లరచిల్లరగా తక్కువ ధరలకు అమ్ముకొని మోసపోయి నష్టపోతున్నారు.

సేంద్రియ ఎరువులతో..

డ్రాగన్ ఫ్రూట్స్ పంట మొదట ఎకరానికి 2 టన్నులు, రెండో సంవత్సరం 4 టన్నులు, తరువాత పది టన్నుల వరకు దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు. ఎలాంటి రసాయన ఎరువులు వాడకుండా కేవలం సేంద్రియ ఎరువులతోనే పండిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఎకరానికి 5 నుంచి 8 క్వింటాళ్లు దిగుబడి వస్తోందన్నారు.

రూ.100కే విక్రయం

డ్రాగన్ ఫ్రూట్ పంటను మొదటగా వేసిన కొత్తలో కిలో రూ.250కి అమ్మగా.. నేడు కిలోకు రూ.100కే అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కర్ణాటక, మహారాష్ట్రలో కూడా డ్రాగన్ ఫ్రూట్ పంటలు పండడంతో.. ఇక్కడి నుంచి ఎగుమతి కాకపోవడంతో ధరలు పడిపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మార్కెట్ ఏర్పాటు చేయాలి

డ్రాగన్ ఫ్రూట్స్‌తోపాటు ఇతర పండ్ల అమ్మకాలకు రైతులకు గిట్టుబాటు ధర లభించేందుకు మార్కెట్లను ఏర్పాటు చేయాలి. మార్కెట్ లేక చిల్లర అమ్ముకోవాల్సిన పరిస్థితి. దీంతో లాభాలు లేకుండా పోతున్నాయి.

అధికారులు పట్టించుకోవాలి



డ్రాగన్ ఫ్రూట్స్ పంట ఇబ్బంది లేకుండా పండించొచ్చు కాని.. అమ్ముకోవాలంటే రైతులకు మార్కెట్ లేదు. గ్రామాలకు వెళ్లి చిల్లరచిల్లరగా తక్కువ ధరలకు అమ్ముకోవాల్సి వస్తోంది. అధికారులు పట్టించుకొని రైతుకు గిట్టుబాటయ్యేలా మార్కెట్లను ఏర్పాటు చేయాలి.

– జంగిలి అశోక్, రైతు, ఇబ్రహీంపట్నం

మా పరిధిలో లేదు

డ్రాగన్ ఫ్రూట్స్ పండించిన రైతులు అమ్ముకునేందుకు మా పరిధిలో లేదు. కేవలం మేము పంటలను పండించేందుకు రైతులకు అవగాహన కల్పిస్తాం. మార్కెటింగ్ శాఖ వారు మార్కెట్లను ఏర్పాటు చేయాలి.

– శ్రీనివాస్, హార్టికల్చర్, హెచ్‌వో

పార్టీ కోసం కష్టపడేవారికి గుర్తింపు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యం

మల్యాల: కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పని చేసేవారిని గుర్తిస్తామని, వారికి పదవుల్లో తగిన ప్రాధాన్యం లభిస్తుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. నూకపల్లి గ్రామ మాజీ ఉపసర్పంచ్ నులుగొండ సురేశ్, బీనవేని రమేశ్ అనుచరులతో కలిసి బుధవారం ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొడిమ్యాల: కొడిమ్యాల–నాచుపల్లి మధ్యలో రూ.4.30కోట్ల వ్యయంతో నిర్మించిన హైలెవెల్ వంతెనను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. ఫ్యాక్స్ చైర్మన్ మేనేని రాజనర్సింగరావు, ఎంపీడీవో స్వరూప, ఆర్‌అండ్‌బీ అధికారులు మహేశ్, ఏఎంసీ డైరెక్టర్ బర్ల లింగయ్య, మాజీ ఎంపీపీ మేనేని స్వర్ణలత, మండల నాయకులు చిలివేరి నారాయణ, గాజుల అజయ్, ప్రభాకర్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, అంతడుపుల జలేందర్ పాల్గొన్నారు.

సింగిల్‌విండో డైరెక్టర్ మృతి



శంకర్(ఫైల్)

సారంగాపూర్: సారంగాపూర్ సింగిల్‌విండో డైరెక్టర్ భూక్య శంకర్(60) బుధవారం మృతిచెందాడు. మండలంలోని మ్యాడారంతండాకు చెందిన శంకర్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శంకర్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన అంత్యక్రియలో విండో చైర్మన్ ఏలేటి నర్సింహారెడ్డి, సీఈవో లైశెట్టి శివకుమార్, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



మెట్‌పల్లిలో..



కోరుట్ల రూరల్: బోనాలతో వెళ్తున్న మహిళలు

మహాలక్ష్మి బోనాల వేడుకలు

మెట్‌పల్లి: పట్టణంలో బుధవారం మహాలక్ష్మి బోనాల వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. బోనాలతో ఊరేగింపుగా శివారులో ఉన్న ఆలయానికి తరలివెళ్లారు. అక్కడ పూజలు చేసి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజీత్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, పలువురు నాయకులు పూజలు చేశారు.

కోరుట్ల రూరల్: పట్టణంలోని ఆరె కటిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం మహాలక్ష్మి అమ్మవారికి బోనాలు సమర్పించారు. మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి నైవేద్యం సమర్పించారు.

స్వగ్రామం చేరిన మృతదేహం



మనోహర్(ఫైల్)

జగిత్యాలక్రైం: జగిత్యాలలోని సాయిరాంనగర్‌కు చెందిన బోగ మనోహర్(45) సౌదీఅరేబియాలో మృతిచెందగా.. ఆయన మృతదేహం బుధవారం స్వగ్రామానికి చేరింది. సారంగాపూర్ మండలం అర్పపల్లికి చెందిన బోగ మనోహర్ సాయిరాంనగర్‌లో స్థిరపడ్డాడు. ఈనెల 4న సౌదీలోని జుబైల్‌లో మృతిచెందాడు. ఎన్‌ఆర్‌ఐ విభాగం ఈనెల 10న అక్కడి ఇండియన్ ఎంబసికి లేఖ రాయగా.. ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించారు. కుటుంబసభ్యులు కన్నీటి మధ్య అంత్యక్రియలు పూర్తి చేశారు.

విద్యార్థులకు నగదు పారితోషికం

కోరుట్ల రూరల్: జోగిన్‌పెల్లి ఉన్నత పాఠశాలలో 2024–25 సంవత్సరంలో పదోతరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నిజామాబాద్‌కు చెందిన గొర్తి ఈశ్వర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం నగదు పారితోషికం పంపిణీ చేశారు.

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి

కొడిమ్యాల: డ్యూటీలో ఉన్న ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి చేసిన ఘటన నాచుపల్లిలో చోటుచేసుకుంది. నాచుపల్లికి చెందిన వంగరి రాజు అనే వ్యక్తి అకారణంగా తనపై దాడిచేశాడని వేములవాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ మొగిలి రవి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

దరఖాస్తులు ఆహ్వానం

జగిత్యాల: 2025 విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో ఐదుగురు గిరిజన విద్యార్థులకు 5 సీట్లు కేటాయించామని, నాలుగు సీట్లు లక్కీడ్రా ద్వారా ఎంపిక చేశామని, 5వ తరగతిలో మిగిలిపోయిన ఎస్టీ(ఎరుకల) బాలురకు ఒక సీటుకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. వివరాలకు 84999 92214 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

జగిత్యాల: దివ్యాంగులు స్వయం ఉపాధి పొందేందుకు సాధికారత సాధించేందుకు వారికి ప్రభుత్వం పునరావాస పథకం ప్రవేశపెట్టిందని, సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని డీడబ్ల్యూవో బోనగిరి నరేశ్ అన్నారు. జిల్లాకు మొత్తం 28 యూనిట్లు మంజూరయ్యాయని, బ్యాంక్ లింకేజీ లేకుండా నేరుగా వంద శాతం సబ్సిడీతో 20 మండలాలకు 20 యూనిట్లు, 5 మండలాలకు 5 యూనిట్లు, కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాలిటీ, బుగ్గారం, సారంగాపూర్, బీర్‌పూర్, ధర్మపురి మున్సిపాలిటీ, రాయికల్ మున్సిపాలిటీ, జగిత్యాల మున్సిపాలిటీ మహిళలకు కేటాయించారని, అర్హులైన దివ్యాంగులు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

జగిత్యాల: అర్బన్ రెసిడెన్షియల్ బాలుర స్కూల్ జగిత్యాలలో అసిస్టెంట్ కుక్ 2 పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో రాము తెలిపారు.

కరీంనగర్ తరలిన కాంగ్రెస్ నాయకులు

మేడిపల్లి: కరీంనగర్‌లో నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ సంస్థాగత పునఃనిర్మాణ సన్నాహక సమావేశానికి ఉమ్మడి మేడిపల్లి మండల నాయకులు తరలివెళ్లారు. ముఖ్య అతిథిగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి అద్దంకి దయాకర్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. భీమారం మండల అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు ఉమ్మడి రవి, సురకంటి రాజిరెడ్డి, బక్కూరి నరేశ్, ఆవ శంఖర్, చెక్కపల్లి శంఖర్, చెక్కపల్లి సంజీవ్, బొమ్మెన ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ తరలిన సభ్యులు

కథలాపూర్: మండలంలోని దళిత బంధు సాధన సమితి సభ్యులు బుధవారం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. హైదరాబాద్‌లో తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసి సమస్యను విన్నవించారు. దళిత బంధు నిధులు విడుదలయ్యే వరకు చేపట్టే ఉద్యమానికి బీఆర్‌ఎస్ మద్దతు ఉంటుందని కేటీఆర్ భరోసా ఇచ్చినట్లు నాయకులు తీట్ల శంకర్, పానుగంటి తిరుజాని, ఉడుగుల ఓంకార్ తెలిపారు.

ఫ్యాన్లు బహూకరణ

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి భక్తుల సౌకర్యార్థం 4 వాల్ ఫ్యాన్లను బహూకరించారు. లయన్స్ క్లబ్ జోనల్ చైర్‌పర్సన్ పిన్న శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా క్లబ్ ఆధ్వర్యంలో దేవస్థానం సిబ్బందికి అందజేశారు.

వైద్య ఖర్చుల కోసం చేయూత

రాయికల్: ఇటిక్యాల గ్రామానికి చెందిన సామల్ల లక్ష్మీనారాయణ అనే నిరుపేద గుండె సమస్యతో బాధపడుతుండగా.. వైద్య ఖర్చుల నిమిత్తం బుధవారం యూత్ కాంగ్రెస్ సేవాసమితి ఆధ్వర్యంలో రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

బుగ్గారం: గోవులాపూర్ గ్రామానికి చెందిన గోవిందుల నాగభూషణం అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా.. ఒక కాలు తీసేశారు. బుధవారం బాధితుడిని పరామర్శించిన మంత్రి సతీమణి కాంతాకుమారి రూ.10వేలు అందించారు. కాంగ్రెస్ నాయకులు వేముల సుభాష్, బల్మూరి రామారావు, గజ్జెల విజయ్, గైని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధితో పేదలకు మేలు

మెట్‌పల్లి: ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం పేదలను ఆర్థికంగా ఆదుకుంటోందని పీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజీత్‌రావు పేర్కొన్నారు. సీఎం సహాయ నిధి నుంచి నియోజకవర్గానికి చెందిన 42 మందికి రూ.21.93లక్షలు మంజూరయ్యాయి. బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, నాయకులు వాకిట సత్యంరెడ్డి, ఖుత్బుద్దీన్, రుత్త నారాయణ, అందె మారుతి తదితరులున్నారు.

ఎన్నికల్లో సత్తా చాటాలి

కథలాపూర్: యాదవులు చైతన్యంగా ఉండి స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని యాదవ సంఘం జిల్లా అడహాక్ కమిటీ అధ్యక్షుడు గానవేని మల్లేశ్ యాదవ్ కోరారు. బుధవారం పెగ్గెర్ల గ్రామంలో యాదవ సంఘం సమావేశం నిర్వహించారు. గ్రామంలో 38 మంది కొత్తగా సభ్యత్వ పత్రాలు అందించారు. బొడ్డు బాలు, రామాంజనేయులు, రవి, అందుగుల సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కోరుట్ల రూరల్: మున్సిపల్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జి.తిరుపతినాయక్, సీఐటీయూ జిల్లా కోకన్వీనర్ ఎంఏ చౌదరి అన్నారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ రవీందర్‌కు వినతిపత్రం సమర్పించారు.

కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలి

కథలాపూర్: ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని ఎంఈవో లోకిని శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల విద్యావనరుల కేంద్రంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అంకాపూర్ దేశీ కూరగాయల విత్తనాలు, మొక్కలను పంపిణీ చేశారు.

మహిళా సంఘ సభ్యులు సాధికారత సాధించాలి

జగిత్యాల: మహిళా సంఘ సభ్యులు బ్యాంకుల ద్వారా రుణాలు పొంది సాధికారత సాధించాలని మున్సిపల్ కమిషనర్ స్పందన అన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో బుధవారం మహిళా సంఘాలతో ప్రొడక్ట్ మేళా నిర్వహించారు. తినుబండారాలు, వివిధ ప్రదర్శనలు, ఉత్పత్తులను ఏర్పాటు చేశారు.

భవన నిర్మాణానికి రూ.3లక్షలు

మెట్‌పల్లి: పట్టణంలో టీచర్స్ యూనియన్ భవన నిర్మాణానికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు చొరవతో ఎస్డీఎఫ్ నిధులు రూ.3లక్షలు మంజూరయ్యాయని పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం తెలిపారు. బుధవారం ప్రొసీడింగ్ కాపీని యూనియన్ నాయకులకు అందజేశారు. ఎంఈవో చంద్రశేఖర్, వేణుగోపాల్, లింగారెడ్డి, తహేర్ తదితరులున్నారు.

మేడిపల్లి: మేడిపల్లి గ్రామ పంచాయతీ భవన మిగులు పనులకు రూ.10లక్షల నిధులు మంజూరు చేసినట్లు వేములవాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ అధికారులు తెలిపారు.

ఒక్కో తరగతికి ఒక్కో ఉపాధ్యాయున్ని కేటాయించాలి

కోరుట్ల రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో ఒక్కో తరగతికి ఒక ఉపాధ్యాయున్ని కేటాయించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని తపస్ జిల్లా కార్యదర్శి అందె శివప్రసాద్, మండల అధ్యక్షుడు గాడిపెల్లి అంజయ్య అన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.



వెల్గటూర్: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ గోడను ఆనుకొని చెట్లు, ముళ్లపొదలతో నిండిన పరిసరాలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ పొదల నుంచి బుధవారం పాములు రోడ్డుపై నుంచి వెళ్లడం చూసిన స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో ఇటీవల విద్యార్థులు పాముకాటుకు గురై మృతిచెందిన సంఘటన నేపథ్యంలో హైస్కూల్ పక్కన ముళ్లపొదలు తొలగించి పరిసరాలు శుభ్రం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

వేతనాలు ఇప్పించండి



ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

బుగ్గారం: 3 నెలలుగా వేతనాలు రాక తామంతా తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని, తమ జీవనం భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తూ మండల ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అఫ్జల్‌మియాకు వినతిపత్రం అందించారు. ప్రభుత్వం స్పందించి వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గడ్డం రమేశ్, చంద్రశేఖర్, గంగాధర్, నాగరాజు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి: 3 నెలల నుంచి ఫీల్డ్ అసిస్టెంట్లకు జీతాలు చెల్లించకపోవడంతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశం బహిష్కరించారు. ధర్మపురితోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో జాతీయ ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రభుత్వం 3 నెలల నుంచి చెల్లించడం లేదని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. ఎంపీడీవో రవీందర్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఉపాధ్యాయుడికి ప్రశంస పురస్కారం



ప్రశంసాపత్రం అందుకుంటున్న అశోక్

జగిత్యాలటౌన్: జగిత్యాలకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు భోగ అశోక్‌ను కేంద్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి శ్రీహర్ష మల్హోత్రా అభినందించి ప్రశంసాపత్రం అందజేశారు. బుధవారం ఆసిఫాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా విద్యాశాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి స్థానిక స్కూల్ విద్యార్థులతో ఆంగ్లంలో రాయబడిన యంగ్‌మైండ్స్ టైంలెస్ టేల్స్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకానికి కవర్ పేజీ డిజైన్‌తోపాటు లోపలి పేజీల్లో ముద్రించిన 24 కథలకు బొమ్మలు వేసిన అశోక్‌ను అభినందించిన మంత్రి ప్రశంసాపత్రంతో సత్కరించారు.

ప్రొసీడింగ్ పత్రాలు అందజేత



రాయికల్‌లో అందిస్తున్న ఎంపీడీవో

రాయికల్: పట్టణంతోపాటు మండలంలోని 32 గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు బుధవారం ప్రొసీడింగ్ పత్రాలను ఎంపీడీవో చిరంజీవి, ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు అందజేశారు. ఎంపీవో సుష్మ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సారంగాపూర్: ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మించుకోవాలని ఎంపీడీవో చౌడారపు గంగాధర్ అన్నారు. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు.

ఇబ్రహీంపట్నం: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. గోధూర్, యామపూర్, ఫకీర్‌కొండాపూర్, వేములకుర్తి గ్రామాల్లో నిర్మాణాలను పరిశీలించారు.

మల్లాపూర్: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఓడ్డెరకాలనీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేసి ముగ్గు పోశారు. వన సంరక్షణ సమితి చైర్మన్ సిరిపురం రవీందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నూతిపెల్లి రాజం తదితరులు పాల్గొన్నారు.

శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్రపై హర్షం



శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

జగిత్యాలటౌన్: శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్ర విజయవంతం కావడంపై హర్షం వ్యక్తం చేసిన భారత్ సురక్షా సమితి నేతలు బుధవారం జాతీయ జెండాలు ప్రదర్శిస్తూ తహసీల్ చౌరస్తాలో సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఏసీఎస్ రాజు మాట్లాడారు. అక్కినపెల్లి కాశీనాథం, చిట్ల గంగాధర్, సింగం గంగాధర్, నరేందుల శ్రీనివాస్, బండారి మల్లికార్జున్, కొత్త కొండ బాలన్న తదితరులున్నారు.

షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరిస్తాం

మల్లాపూర్: నిజాం షుగర్ ఫ్యాక్టరీని పునరుద్ధరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. చెరుకు రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఫ్యాక్టరీల పునరుద్ధరణకు కమిటీ అధ్యయనం చేస్తోందన్నారు. సొంత నిధులతో ఫ్యాక్టరీని తెరిపిస్తానన్న ఎంపీ అర్వింద్ హామీ ఏమైందని ప్రశ్నించారు. నాయకులు మరిపెల్లి మల్లయ్య, రామలక్ష్మణ్, సురేశ్, బండారి రమేశ్, జటోత్ రాజేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెషర్స్ డే వేడుకలు

రాయికల్: రామాజీపేట గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు గజ్జెల నరేందర్, ఉపాధ్యాయులు లక్ష్మీకాంతం, రమేశ్, విజయ్‌కుమార్, కిరణ్, యశోద, పీఈటీ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తిగత రక్షణ పరికరాలపై అవగాహన

కోరుట్ల రూరల్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు వ్యక్తిగత రక్షణ పరికరాలపై మున్సిపల్ కమిషనర్ రవీందర్‌గౌడ్ బుధవారం అవగాహన కల్పించారు. ఆయుష్మాన్ భారత్ కోసం ఈకేవైసీ చేయించారు. పీపీఈ కిట్లను పంపిణీ చేశారు.

వాహనాలకు వేలం

ధర్మపురి: వివిధ కారణాలతో పట్టుబడిన వాహనాలకు వేలం పాటలు నిర్వహించగా.. రూ.2,19,964 ఆదాయం సమకూరినట్లు ఎక్సైజ్ సీఐ ఠాకూర్ మహేందర్‌సింగ్ తెలిపారు.